ఎరువుల దుకాణాల తనిఖీ

పెడన: పట్టణంలో ఎరువుల దుకాణాలను గురువారం వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. బంటుమిల్లి రోడ్డులోని నాలుగు దుకాణాల్లో రికార్డులు, స్టాకు తదితర వాటిని ఇన్‌ఛార్జి ఏడీఈ ఎస్ రమాదేవి, ఇన్‌ఛార్జి ఏఓ నూరున్నీసా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాలలో స్టాకు, ధరల వివరాలను ప్రదర్శించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇటువంటి పొరబాట్లు పునరావృతం అయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రైతులకు తప్పనిసరిగా బిల్లులు(రశీదులు) ఇవ్వాలని సూచించారు.

కార్నియా సేకరణ

అవనిగడ్డ: స్థానిక మూడవ వార్డుకు చెందిన కూరేటి లంకేశ్వరమ్మ(53) నేత్రాలను కుటుంబ సభ్యులు కృష్ణారావు, సాయిధరణి, వైష్ణవి దానం చేశారు. గురువారం ఆమె అనారోగ్యంతో మృతిచెందగా సుదర్శి మానవతా సేవాసంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ ఆధ్వర్యంలో విజయవాడ ఎల్‌వీ ప్రసాద్‌కు చెందిన వైద్యులు లంకేశ్వరమ్మ నేత్రాల నుంచి కార్నియాను సేకరించారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం



జన్ను రాఘవరావు | మట్టా మోహన నాంచారయ్య | గూడవల్లి నాగరాజు | జవహర్‌లాల్ నెహ్రూ | మేకల సుబ్బన్న | వేమూరి వెంకట్రావు | సమ్మెట జయవర్ధన్

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గం మండల కన్వీనర్లుగా మట్టా మోహన నాంచారయ్య, జన్ను రాఘవరావులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. బందరు మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన జన్ను రాఘవరావు బందరు మండలం సౌత్ కన్వీనర్‌గా, ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామానికి చెందిన మట్టా మోహన నాంచారయ్యను బందరు మండలం నార్త్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఇరువురికి పేర్ని నాని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు, ఇతర నాయకులు అభినందనలు తెలియజేశారు.

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నగర క్లస్టర్ అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు వెలువరించింది. నగరంలోని క్లస్టర్-1 అధ్యక్షుడిగా కార్పొరేటర్ మేకల వెంకట సుధాకర్‌బాబు(సుబ్బన్న), క్లస్టర్-2 అధ్యక్షుడిగా కార్పొరేటర్ కాగిత జవహర్‌లాల్ నెహ్రూ, క్లస్టర్- 3 అధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ గూడవల్లి నాగరాజులను నియమించారు.

గూడూరు: వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడిగా సమ్మెట జయవర్ధన్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది. ముక్కొల్లు సర్పంచిగా, గూడూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించిన జయవర్ధన్ గూడూరు మండల అధ్యక్షుడిగా నియామకం అయ్యారు.

పెడన నియోజకవర్గంలో..

పెడన: నియోజకవర్గంలోని పెడన పట్టణంతోపాటు ఆయా మండలాలకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు నియమితులయ్యారు. పెడన పట్టణ అధ్యక్షుడిగా కర్నా శ్రీనివాసరావు, పెడన మండలం అధ్యక్షుడిగా దావు బైరవలింగం, బంటుమిల్లికి ముత్యాల నాగేశ్వరరావు, గూడూరుకు సమ్మెట జయవర్ధన్, కృత్తివెన్ను మండల అధ్యక్షుడిగా జల్లా భూపతిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఘంటసాల మండల అధ్యక్షుడిగా వేమూరి

ఘంటసాల: వైఎస్సార్ సీపీ ఘంటసాల మండల అధ్యక్షుడిగా వేమూరి వెంకట్రావు నియమితులయ్యారు. వరుసగా నాలుగోసారి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకట్రావును పలువురు పార్టీ నేతలు అభినందించారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



చిలకలపూడి(మచిలీపట్నం): వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ మొల్లమాంబ సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల జిల్లా సంక్షేమాధికారి జీ రమేష్, కలెక్టరేట్ ఏఓ సీహెచ్ ఆంజనేయప్రసాద్, ఏబీసీడబ్ల్యూవో ఎండీ షహతుల్లా, కుమ్మరి, శాలివాహన సంఘ నాయకులు, వసతి గృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో డీఎస్సీ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు సాంఘిక సంక్షేమశాఖ డీడీ షేక్ షాహెద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు మార్చి 15వ తేదీలోగా ఎంప్యానల్డ్ కోచింగ్ సంస్థలను ప్రాధాన్యతలను నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు వారి ప్రాధాన్యత ప్రకారం ఉచిత డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు.

సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పవిత్ర పుణ్యక్షేత్రాలైన సప్త జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు భక్తులు, యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) విజయవాడ నుంచి భారత్ గౌరవ్ పర్యాటక రైలును నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల లోని యాత్రికులు ఏప్రిల్ 8 నుంచి 19వ తేదీ వరకు దేశంలోని ఏడు జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు ఈ రైలును నడుపుతున్నట్లు వివరించారు. ఈరైలు విజయవాడ నుంచి ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. 11రాత్రులు, 12రోజులపాటు సాగే ఈ ప్రయాణంలో ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకాలోని నాగేశ్వర్, సోమనాథ్‌లోని సోమనాథ్ జ్యోతిర్లింగం, పూణేలోని భీమశంకర, నాసిక్‌లోని త్రయంబకేశ్వర్, ఔరంగాబాద్‌లోని గ్రిష్ణేశ్వర జ్యోతిర్లింగాల దర్శనం ఉంటుంది. ఈ యాత్రలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయంతోపాటుగా పర్యటక ప్రదేశాలను దర్శించుకునేందుకు రోడ్డుమార్గంలో రవాణా సదుపాయం, హోటల్స్‌లో బస ఏర్పాట్లు ఉంటాయన్నారు. ప్రతి కోచ్‌కు ఎస్కార్ట్, టూర్ గైడ్, టూర్ మేనేజర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ప్యాకేజీ వివరాలు...

మూడు కేటగిరీలుగా ఉన్న ప్యాకేజీలో ఎకానమి(స్లీపర్ క్లాస్)లో పెద్దలకు ఒక్కొక్కరికి రూ.20,890, పిల్లలకు రూ.19,555, స్టాండర్డ్ (3ఏసీ) పెద్దలకు రూ.33,735, పిల్లలకు రూ.32,160, కంఫార్ట్ (2ఏసీ) పెద్దలకు రూ.44,375, పిల్లలకు రూ.42,485గా ధర నిర్ణయించారు. ఆసక్తికలిగిన వారు విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయం లేదా సెల్‌నంబర్లు 9281495848, 92810 30714లో సంప్రదించాలన్నారు. ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ ద్వారా కూడా టిక్కెట్లు బుక్‌చేసుకోవచ్చని వివరించారు.

తృటిలో తప్పిన ప్రాణాపాయం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కృత్తివెన్ను: అతివేగంగా వచ్చిన భారీవాహనం కారును ఢీ కొట్టడంతో కారు ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, భారీ వాహనానికి మధ్యన ఇరుక్కుపోయింది. ఈ సమయంలో కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులోని ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. స్థానికుల కథనం మేరకు.. నరసాపురం నుంచి మచిలీపట్నం వెవెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను దించేందుకు బస్‌స్టాప్ వద్ద ఆగింది ఈ సమయంలో దాని వెనుక వస్తున్న కారును అదే సమయంలో దాని వెనుక వచ్చిన మరో భారీ వాహనం ఢీ కొట్టింది. దీంతో కారు బస్సు, భారీ వాహనానికి మధ్య ఇరుక్కుపోయింది. ఈ ఘటనలో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే కారులోని వ్యక్తులను బయటకు దించి వైద్యచికిత్స కోసం భీమవరం తరలించారు. ఘటనలో కారు ముందు, వెనుక భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

రవాణశాఖ కార్యాలయానికి సొంత భవనం నిర్మించండి



కోనేరుసెంటర్: మచిలీపట్నం ప్రాంతీయ రవాణా కార్యాలయానికి కేటాయించిన స్థలంలో భవనం నిర్మించాలని కోరుతూ ఆర్టీవో శ్రీనివాస్ నాయక్‌ను బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సంఘ నాయకులు గురువారం ఆర్టీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రాంతీయ రవాణా కార్యాలయానికి కేటాయించిన స్థలం మచిలీపట్నంలో ఉన్నప్పటికీ భవన నిర్మాణం చేపట్టకుండా అద్దె భవనాల్లో విధులు నిర్వహించడం శోచనీయమన్నారు. 12 మండలాలకు సంబంధించిన కార్యాలయాన్ని వెంటనే నిర్మించి అక్కడి నుంచే కార్యకలాపాలను నిర్వహించాలని ఆర్టీవోను కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చింతపట్ల నాని, ధనికొండ చిన్ని, భోగిరెడ్డి చిన సుభాని, బబ్బు, నేలపాల దుర్గ, చేబోయిన కోటేశ్వరరావు, పాండు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు సత్కారం



మచిలీపట్నంటౌన్: మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీవో హోమ్‌లో గురువారం పలువురు ల్యాబ్ టెక్నీషియన్లను ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యాన ఆ సంఘ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లి కృష్ణ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ల్యాబ్ టెక్నీషియన్లు అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 2.46 లక్షలు

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని దేవదాయ అధికారులు గురువారం లెక్కించారు. 127 రోజులకుగాను రూ. 2,46,071 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారిణి తెలిపారు.

క్లెయిమ్‌ను వడ్డీతో సహా చెల్లించాలంటూ తీర్పు

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి వడ్డీతో సహా క్లెయిమ్ మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే...విజయవాడకు చెందిన బి.వెంకటసింహాచలం ఆంధ్రాబ్యాంకు కానూరు బ్రాంచ్‌లో సేవింగ్స్ ఖాతా ఉంది. బ్రాంచ్ మేనేజర్ సలహా మేరకు ఈ ఖాతా ద్వారా ఏబీ ఆరోగ్యధాన్ పాలసీని 2015 ఆగస్టు 20వ తేదీన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో తీసుకున్నారు. 2018 జూన్ 8వ తేదీ వరకు పాలసీ ప్రీమియంను సకాలంలో చెల్లించారు. ఫిబ్రవరి 2018లో అనారోగ్య కారణంగా లేపరోస్కోపీ శస్త్రచికిత్స నిమిత్తం రూ.1,64,435 ఖర్చు చేశారు.ఈ క్రమంలో క్లెయిమ్ కోసం ఇన్స్యూరెన్స్ కంపెనీని సంప్రదించగా ముందుగానే అనారోగ్యం ఉందని తెలియజేయలేదంటూ క్లెయిమ్‌ను తిరస్కరించారు. దీంతో బాధితుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం కమిషన్ సభ్యులు 2018 జూన్ 19వ తేదీ నుంచి 9శాతం వడ్డీతో రూ.1,64,435 చెల్లించాలని, మానసిక వేదన కలిగించినందుకు రూ.25వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5వేలు చెల్లించాలని సదరు ఇన్స్యూరెన్స్ కంపెనీని ఆదేశిస్తూ తీర్పు చెప్పారు. ఈ మొత్తాన్ని 30 రోజుల్లోగా ఖాతాదారుడికి అందజేయాలని ఆ తీర్పులో ఆదేశించారు.

వాహనాల వేగ నియంత్రణ చర్యలు

పెడన: పెడన-బంటుమిల్లి రోడ్డులోని చూజీ కంపెనీ సమీపంలో మచిలీపట్నం మండలం బుద్దాలపాలెం వెళ్లే మార్గం వద్ద పెడన ఎస్ఐ జీ సత్యనారాయణ వాహనాల వేగాన్ని నియంత్రించేలా రేడియం స్టిక్కర్స్‌తో తోటమూల నుంచి బుద్దాలపాలెం వెళ్లే మార్గం వద్ద డ్రమ్ములను ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

పేదలందరికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

మచిలీపట్నంటౌన్: స్థానిక 28వ డివిజన్ జలాలపేటలో గత 20 ఏళ్లగా నివాసముంటున్న అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం నగర కమిటీ అధికారులను డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం గురువారం ప్రజా చైతన్య యాత్ర నగరంలోని 23, 28 డివిజన్ జలాలపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి బీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రకారం జలాలపేటలోని పేదలకు ఇంటి పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ కమిటీ సభ్యులు, ప్రజా నాట్య మండలి కార్యదర్శి శివశేశ్వర్ పాల్గొన్నారు.

నదిలో పడి వ్యక్తి మృతి



మృతుడు సురేష్(ఫైల్)

కంచికచర్ల : మొక్కజొన్న విత్తనాలను కాటా వేసేందుకు వెళ్లిన ఓవ్యక్తి బహిర్భూమికని వెళ్లి కృష్ణా నదిలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందిన సంఘటన గురువారం కంచికచర్ల మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు కథనం మేరకు వీరులపాడు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన పడిగెల సురేష్‌బాబు(43) తోటికూలీలతో కలసి మొక్కజొన్న విత్తనాలను కాటా వేసేందుకు బుధవారం మండలంలోని కొత్తపేట గ్రామానికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో బహిర్భూమికి కృష్ణానది వైపు వెళ్లి, ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి గల్లంతయ్యాడు. అయితే సురేష్ ఇంటికి వెళ్లాడనుకుని తోటి కూలీలు వారి గ్రామాలకు వెళ్లారు. సురేష్ ఇంటికి చేరకపోవడంతో రాత్రంతా అతనికోసం వెతికారు. కాని అతని జాడ తేలియలేదు. ఈక్రమంలో గురువారం ఉదయం కుటుంబసభ్యులు, తోటి కూలీలు తిరిగి కొత్తపేట గ్రామానికి వెళ్లి కృష్ణానదిలో వెతుకగా, సురేష్ మృతదేహం నదిలో తేలియాడుతున్నట్లు గుర్తించి వెంటనే పోలీసులకు తెలియజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు సురేష్‌కు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. సురేష్ మృతితో ఆకుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

వైఎస్ జగన్‌ను కలిసిన ఇన్‌చార్జ్‌లు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పేర్ని నాని, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కృష్ణాజిల్లాలోని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నాయకులు కలిశారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీమంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కైలే అనిల్‌కుమార్, ఉప్పాల రమేష్ (రాము), దేవభక్తుని చక్రవర్తి, సింహాద్రి రమేష్, పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)లు జగన్‌ను కలిశారు. వీరితోపాటు పార్టీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, గాదెల్లి డేవిడ్‌శామ్యూల్, సింహాద్రి వికాస్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ప్రకటన

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కమిటీని నియమిస్తూ గురువారం ఆపార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా జొన్నలగడ్డ రామ్మోహన్‌రెడ్డి (పామర్రు), మండలి హనుమంతరావు (గుడివాడ), బొర్రా విఠల్‌రావు (మచిలీపట్నం), గోన మదన్ (పెనమలూరు), పిన్నెంటి మహేష్ (పెడన), పడమట వీరకుమార్ (అవనిగడ్డ)లను నియమించారు. ప్రధానకార్యదర్శులుగా కందుల నాగరాజు (గుడివాడ), శీలం శ్రీరాములు (పెనమలూరు), కౌంతి ఫరీద్ (మచిలీపట్నం), మేకల సుధాకర్ బాబు (సుబ్బన్న) (మచిలీపట్నం), మోర్ల రామచంద్రరావు (పామర్రు), గౌరిపర్తి రవికుమార్ (పెడన), మోపిదేవి ద్వారకానాథ్ (అవనిగడ్డ), కోశాధికారిగా బండెల నోబుల్‌థామస్ (మచిలీపట్నం), ఆర్గనైజేషనల్ సెక్రటరీలుగా కోటప్రోలు నాగు (గుడివాడ), ఈదా రాజేష్ (పెనమలూరు), ఎండీ ఫజులుల్లా (పెనమలూరు), జువ్వా నాగరాజు (మచిలీపట్నం), జోగి చిరంజీవి (మచిలీపట్నం), మట్టా నాగబాబు (పెడన), బందారు చంద్రశేఖర్ (పెడన), బడే సూర్యనారాయణ (అవనిగడ్డ), తోట సాయిబాబు (అవనిగడ్డ), కారే జోసఫ్ (గుడివాడ), నాగబోయిన సునీల్ (పామర్రు), తిరుమలశెట్టి బోసుబాబు (పామర్రు), అబ్దుల్ ఖాదర్ జిలానీ (పెడన) నియమితులయ్యారు. యాక్టివిటీ సెక్రటరీలుగా ఉప్పాల వీరబాబు (పెనమలూరు), పాలడుగు శివజ్యోతి (పెనమలూరు), గూడవల్లి నాగరాజు (మచిలీపట్నం), గణేశన రమేష్‌బాబు (మచిలీపట్నం), పెంది వెంకన్నబాబు (పెడన), లంకా సుబ్రహ్మణ్యం (పెడన), మోర్ల శ్రీనివాసరావు (అవనిగడ్డ), లింగం జగదీష్ చంద్రకుమార్ (అవనిగడ్డ), కోర్నిపాటి గణపతి (గుడివాడ), వెంపటి సాల్మన్ (గుడివాడ), ముత్యాల నాగరాజు (పామర్రు), దేవభక్తుని రాము (పామర్రు)లను నియమించారు. అధికార ప్రతినిధులుగా నట్టా వెంకటేశ్వరరావు (పెనమలూరు), షేక్ ముస్తఫా (అచ్చెబా) (మచిలీపట్నం), గరికిపాటి రామానాయుడు (పెడన), గుర్రం బసవయ్య (అవనిగడ్డ), మీర్ అస్గర్ అలీ (మచిలీపట్నం), ఎంవీ నారాయణరెడ్డి (గుడివాడ), చీకుర్తి వరప్రసాద్(పామర్రు)లను నియమించారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

మోపిదేవి: మహాత్మా జ్యోతిభా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5,6,7,8,9, ఇంటర్ మొదటి సంవత్సరం తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంచినట్లు పాఠశాల కన్వీనర్, ప్రిన్సిపాల్ కే వీర రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ఈనెల 25వ తేదీలోగా సమర్పించాలని కోరారు. ఇతర వివరాలకు దగ్గరలోని గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్

కోనేరుసెంటర్: మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తాళ్లపాలెం గ్రామంలో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బెల్టుషాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తాళ్లపాలెం గ్రామానికి చెందిన పరసా వీరయ్య అనే వ్యక్తి నుంచి 41 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంటేశ్వరమ్మ తెలిపారు. గ్రామాల్లో బెల్టుషాపులకు సంబంధించి సమాచారం ఉంటే వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. బెల్టుషాపుల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు.

ముగిసిన మహంకాళమ్మ జాతర

గూడూరు: ముక్కొల్లులో ప్రసిద్ధి చెందిన శ్రీ మహంకాళమ్మ జాతర గురువారం ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన జాతరలో చివరి రోజున పోతురాజు గెడలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు మొక్కుబడులు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఈఓ టీవీవీ మోహనరావు పర్యవేక్షించారు.

నేటి నుంచి దయాకుంభ్ ఉత్సవం

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో వేంచేసి ఉన్న జగద్గురు శ్రీ రామానుజాచార్య సంస్థాన్ శ్రీధామ్‌లో శుక్రవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు దయాకుంభ్-2025(శ్రీ లక్ష్మీజయంతి) ఉత్సవాలు నాలుగు రోజుల పాటు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. జగద్గురు శ్రీరామానుజాచార్య సంస్థాన్ వారి నిర్వహణలో శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీనివాస శ్రీకరాస్వామివారి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిచనున్నారు. 14వ తేదీన జరిగే కార్యక్రమానికి అనంత శ్రీ విభూషిత శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామిజీ, 15న శ్రీ త్రిదండి అష్టాక్షరీ జీయర్ స్వామిజీ, శ్రీ త్రిదండి బృందావన జీయర్ స్వామిజీ, శ్రీ త్రిదండి శఠగోపముని జీయర్ స్వామిజీ హాజరుకానున్నారు. 16న ఇస్కాన్ శ్రీ ప్రణవానందదాస్ మహరాజ్ స్వామిజీ, 17న ఉ.వే. శ్రీమాన్ స్థలశాయి స్వామిజీ (భద్రాచల స్థానాచార్యస్వామి) పాల్గొంటారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

అవనిగడ్డ: ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాలపై సర్పంచ్ గొరుముచ్చు ఉమా షాపుల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. అవనిగడ్డలోని పలు ప్రాంతాల్లో గురువారం సర్పంచ్, కార్యదర్శి అనితతో కలిసి పర్యటించారు. ప్లాస్టిక్ రహిత పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): పాఠశాల విద్య - సమగ్ర శిక్ష ద్వారా పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ఆర్ట్, వర్క్, హెల్త్ - ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైమ్ కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ ఎన్ దేవేంద్రరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఉన్న 25 వేల మంది ఉద్యోగులకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఇచ్చిన హామీని ఇంత వరకు అమలు చేయలేదన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని దేవేంద్రరావు కోరారు.

స్వచ్ఛత గ్రామాలకు సహకారం అందించాలి

అచ్చెంపాలెం(ఘంటసాల): స్వచ్ఛత గ్రామాలకు ప్రజలంతా సహకరించాలని ఘంటసాల ఈఓపీఆర్డీ కే వెంకటేశ్వరరావు కోరారు. ఘంటసాల మండలం అచ్చెంపాలెం గ్రామంలో తడి పొడి చెత్త సేకరణ చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సిబ్బంది పనితీరును ఈఓపీఆర్డీ గురువారం పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలని ప్రజలను కోరారు. ఈఓ ఆర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని లంకపల్లి, దాలిపర్రు, కొడాలి, మల్లంపల్లి, చినకళ్లేపల్లి, ఘంటసాలపాలెం, ఘంటసాల, చిట్టూర్పు, శ్రీకాకుళం, కొత్తపల్లి గ్రామ పంచాయతీల్లో ఈఓలు తడి పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించండి

చల్లపల్లి: జగనన్న కాలనీ, చల్లపల్లి నారాయణరావునగర్ కాలనీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం చల్లపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి యద్దనపూడి మధు ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్రరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారికి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి తిరునక్షత్ర పూజలు



కోడూరు: దివి శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్పస్వామివారి ఆలయంలో శుక్రవారం స్వామివారి తిరునక్షత్రాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అయ్యప్ప మూలమూర్తికి పంచామృతాభిషేకం, పుష్పార్చన జరుగుతుందని చెప్పారు. భక్తులే స్వయంగా స్వామివారికి అభిషేకాలు చేయవచ్చని తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నిబద్ధతతో పని చేస్తే మంచి గుర్తింపు

కోడూరు: ఏ శాఖలోని వారైనా నిబద్ధతతో పని చేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని డీఎస్పీ విద్యశ్రీ అన్నారు. కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన వీరాంజనేయులుకు బుధవారం రాత్రి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సభలో డీఎస్పీ మాట్లాడుతూ ఏఎస్‌ఐగా పదవీ విరమణ చేసిన వీరాంజనేయులు సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం వీరాంజనేయులు దంపతులను సత్కరించారు. అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు యువకుమార్, ఈశ్వరరావు, ఎస్‌ఐ చాణిక్య, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

చల్లపల్లి: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. స్థానికంగా విజయక్రాంతి, విజయ జూనియర్ కళాశాలల్లో రెండు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. ఈ రెండు సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావుల పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులు పరీక్షలు ముగించుకుని సెంటర్ల నుంచి బయటకు రాగానే కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపి వారి వారి ఇళ్లకు వెళ్లారు.

నిత్యావసరాల పంపిణీ

గూడూరు: హెచ్‌సీఎల్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కప్పలదొడ్డిలోని 300 మంది కలంకారీ కార్మికులకు గురువారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. స్థానిక పుణ్యవతి కలంకారీ యూనిట్ దగ్గర కార్మికులకు నిత్యావసరాలు అందజేశారు. సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ సభ్యురాలు పేరిశెట్టి తేజోవతి, వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రతినిధులు, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఆత్మరక్షణపై అవగాహన అవసరం

డీవైఈఓ శేఖర్‌సింగ్

మచిలీపట్నంటౌన్: బాలికలకు ఆత్మరక్షణకు సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన అవసరమని మచిలీపట్నం డీవైఈఓ శేఖర్‌సింగ్ అన్నారు. సమగ్ర శిక్ష కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని రుస్తుంబాద మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో బాలికలకు ఆత్మరక్షణలో మెళకువలను నేర్పేందుకు రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శేఖర్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాలో 353 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న బాలికల ఆత్మరక్షణకు ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా రెండు ఏజెన్సీలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఆ ఏజెన్సీ ప్రతినిధులు ప్రతి రోజు ఒక పాఠశాలకు వెళ్లి బాలికలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.



ఆత్మ రక్షణపై బాలికలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఒక్కో పాఠశాలలో 10 రోజులు గంట పాటు బాలికలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల సీనియర్ అధ్యాపకులు లలిత మోహన్, సీఎంఓ రమేష్, ఏఎస్ఓ నగేష్, ఏపీవో ఏడుకొండలు, ఐఈ కోఆర్డినేటర్ రాంబాబు, జీసీడీఓ సీతామహాలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

నాగాయలంక: స్థానిక స్కాలర్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని నాగాయలంక ఎస్‌ఐ కే రాజేష్ ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఆలోచనాత్మకంగా ఉన్నాయి. స్వచ్ఛ నాగాయలంక ప్రతినిధి సింహాద్రి కృష్ణప్రసాద్, పాఠశాల నిర్వాహకులు సునీల్‌కుమార్ పట్నాయక్, నిర్మలా పాణిగ్రాహి, హెచ్‌ఎం పరిశె కృష్ణ, మహిళా నేత స్వర్ణలత, రెడ్‌క్రాస్ కోశాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పరాసుపేట సెంటర్ ప్రాంతంలో రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేసిన బడ్డీలు, దుకాణాలను గురువారం జేసీబీ, క్రేన్ సాయంతో తొలగించారు. పరాసుపేట సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్‌ను సైతం ధ్వంసం చేశారు. పరాసుపేట సెంటర్ నుంచి సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్, దిమ్మల సెంటర్ వైపు ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఆ ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న ఎంతో మంది చిరువ్యాపారులు లబోదిబోమన్నారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు

గోగినేనిపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో గురువారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం టీవీ గోపాలరావు, ఉపాధ్యాయులు విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెడన: స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో గురువారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా డైట్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అప్స రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాబుజాన్, అప్స మచిలీపట్నం డివిజన్ అధ్యక్షుడు కేవీ జాన్, శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ బీ హరీష్‌బాబు, శ్రీ విజయానంద కాలేజీ డైరెక్టర్ వీ విద్యాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ

కృత్తివెన్ను: ఉపాధ్యాయులు బోధనలో మరిన్ని మెళకువలు తెలియజేసేలా టీచ్ టూల్ పేరుతో శిక్షణ నిర్వహించినట్లు ఎంఈఓ ప్రసాదరావు తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీలో గురువారం నిర్వహించిన ఈ శిక్షణలో ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొని పలు అంశాలను ఉపాధ్యాయులకు వివరించారు. పలువురు ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కిక్కిస మొక్కల తొలగింపు



చల్లపల్లి: మండల పరిధిలోని లక్ష్మీపురం నుంచి మాజేరు వరకు గుండేరు మేజర్ మురుగు కాలువలో పేరుకుపోయిన కిక్కిస మొక్కల తొలగింపు పనులను గురువారం ప్రారంభించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు రూ.27.63లక్షలతో గుండేరు డ్రెయిన్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న బండిరేవుకోడు, మంగలివానిసింకు, గొర్రుకోడు, రత్నకోడు, చెన్నకేశవ కోడుల్లో పెరిగిన కిక్కిల మొక్కల తొలగింపు చేపడుతున్నట్లు తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. రాబోయే వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. చల్లపల్లి డ్రెయినేజీ డీఈ జే బాబూనాయక్, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, నీటి సంఘాల అధ్యక్షుడు పరిశే చలపతిరావు, ఏఈ చిరంజీవి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి

'అద్దంకి నాంచారమ్మ' ప్రధాన జాతర ఉత్సవాలు ప్రారంభం

కోడూరు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కృష్ణాతీరంలో భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన జాతరోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైయ్యాయి. గుంటూరు, ప్రకాశం జిల్లా భక్తులు అమ్మవారి పుట్టింటివారు కావడంతో అక్కడి మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పాలపొంగళ్లు, నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. లారీలు, ట్రాక్టర్లు, ఆటోలకు రంగులద్ది ప్రదక్షిణలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు.



విద్యుత్‌దీపాలతో నాంచారమ్మ అమ్మవారి దేవాలయం

అంతరాలయ దర్శనానికి పోటెత్తిన భక్తులు

నాంచారమ్మ తల్లి మూలమూర్తికి చేసిన అలంకారం భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. బంగారం, వెండి ఆభరణాలతో పాటు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం మొత్తం పూలతోరణాలు, అరటిపిలకలతో తీర్చిదిద్ది భక్తులకు స్వాగతం పలికారు. గర్భాలయానికి వెళ్లి అమ్మవారిని తాకే భాగ్యం కలగడంతో భక్తులు అంతరాలయ దర్శనానికి పోటెత్తారు. పలువురు చిన్నారులను ఊయ్యాలలో వేసి మొక్కులు తీర్చుకున్నారు.



విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారు

నేడు రెండు లక్షల మంది వచ్చే అవకాశం

జాతరలో శుక్రవారం జరిగే ప్రధాన ఘట్టమైన గుడి సంబరానికి రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల కోసం భారీ టెంట్లు, నైవేద్యాలు తయారికి వసతులతో పాటు అన్నసమారాధన ఏర్పాట్లు కూడా చేశారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో విశ్వనాథపల్లి స్పెషల్ పేరుతో రేపల్లె, అవనిగడ్డ నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కృష్ణానది వద్ద పటిష్టమైన బారికేట్లు నిర్మించి గజ ఈతగాళ్లతో రక్షణ కల్పిస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్యూలైన్లు నిర్మించారు.

ఆలయ చరిత్ర

విశ్వనాథపల్లి గ్రామంలో సుమారు ఐదు శతాబ్దాల క్రితం తీవ్ర కరువు వచ్చింది. పశువులకు కనీసం పశుగ్రాసం కూడా దొరకని పరిస్థితి. దీంతో ఈ ప్రాంత రైతులు తమ పశువులను నాటి ప్రకాశం జిల్లా అద్దంకి గ్రామానికి (ప్రస్తుతం బాపట్ల జిల్లా) తోలుకువెళ్లారు. అక్కడ పశువులు కొంతకాలం బాగానే ఉన్నా, తర్వాత అంతుచిక్కని వ్యాధితో మృతిచెందాయి. దీంతో రైతులు తిరిగి మళ్లీ తమ పశువులను విశ్వనాథపల్లికి తీసుకువచ్చారు. ఆ సమయంలో పశువులతో పాటు ఓ బాలిక కూడా విశ్వనాథపల్లికి వచ్చి ఇక్కడ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన ఒక మహిళకు పూనకం వచ్చి తాను అద్దంకి నాంచారమ్మనని, తనకు గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టాలని కోరింది. దీంతో గ్రామపెద్ద రామినీడు గ్రామ నడిబొడ్డు అమ్మవారికి చిన్నపాటి ఆలయాన్ని నిర్మించి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. కరువు తొలగి గ్రామస్తులు ఆర్థికంగా వృద్ధిచెందారు. అప్పటి నుంచి ప్రతి ఏటా అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఇంటింటికీ చిన్నఅమ్మవారు

జాతరకు పదిహేను రోజుల ముందు (పాల్గుణ శుద్ధ పాడ్యమి) రోజున నాంచారమ్మ చిన్నఅమ్మవారిని ఆలయం నుంచి బయటకు తీసి ఊరేగింపు నిర్వహిస్తారు. ఆలయం నిర్మించిన గ్రామపెద్ద రామినీడుకు కూడా ప్రత్యేక ఉత్సవాన్ని జరుపుతారు. విశ్వనాథపల్లి, వి.కొత్తపాలెం, గాబ, కుమ్మరిపాలెం గ్రామాల్లో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి భక్తులు పూజలు చేస్తారు. వాహనాలు లేకుండా గ్రామస్తులు నడుచుకుంటూనే అమ్మవారిని ఊరేగించడం ఇక్కడ ప్రత్యేకత.

16న ఉచిత కంటి వైద్య శిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఆర్ఐ బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ విద్యా నికేతన్ డిజిటల్ స్కూల్‌లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం ఉంటుందన్నారు. 94906 36466, 70936 17778 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

చల్లపల్లి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ అంతర్గత రోడ్డుకు గురువారం మరమ్మతులు చేపట్టారు. రోడ్డు పరిస్థితిపై ప్రయాణికులు అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ హనుమంతరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో రూ.80వేలతో మరమ్మతులు చేపట్టినట్లు అసిస్టెంట్ ఇంజినీరు సుభాని తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మెయిన్ బ్రాంచి, మచిలీపట్నం వారి సూచనల ప్రకారం తెలియచేయునది ఏమనగా, శ్రీ యెండూరి శ్రీ వెంకటేశ్వరరావు S/o. పూర్ణచంద్రరావు, నివాసం గుండుపాలెం, మచిలీపట్నం మండలం, కృష్ణాజిల్లా ... [illegible]

పెదప్రోలు గ్రామంలో జాతర ఉత్సవాలు



మోపిదేవి: మండలంలోని పెదప్రోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించనున్నారు. శతాబ్దాల కాలం నాటి అమ్మవారికి ప్రతి ఏడాది 15 రోజుల పాటు గ్రామోత్సవం నిర్వహించి పౌర్ణమినాడు గుడి సంబరంతో అమ్మవారిని ఆలయ ప్రవేశం చేస్తారు. కోనేరులో నిర్మించిన ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ఆలయ కమిటీ ఇటీవల చేపట్టిన తవ్వకాల్లో 1919 నాటి శిలాఫలకం బయట పడింది. ఆ శిలాఫలకంపై ఉన్న లిపిని బట్టి గుంటూరు జిల్లాకు చెందిన పద్మశాలీల గ్రామ దేవతగా గుర్తించారు. దీంతో ఈ ఏడాది పద్మశాలీల విన్నపంపై వారి వారసులచే తొలిపూజలకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ బందోబస్తు ఏర్పాటు చేశారు.